సాక్షి ప్రకాశం

సోమవారం । 19 । ఫిబ్రవరి । 2024



కలిసికట్టుగా ముందుకు సాగుదాం

కలిసికట్టుగా పనిచేసి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుందామని కనిగిరి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. - 8లో..



వైఎస్ పాలనలోనే ముస్లింలకు పెద్దపీట

వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లింలకు రిజర్వేషన్లు ఇచ్చారని మాజీ ఎమ్మెల్యే, దర్శి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి అన్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
33/21

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

ఏకాగ్రతతో అధ్యయనం చేస్తే మంచి మార్కులు



ట్రైనర్లు డాక్టర్ రవీంద్ర

ఒంగోలు: ఏకాగ్రతతో అధ్యయనం చేస్తే మంచి మార్కులు సులువుగా సాధించవచ్చని ప్రముఖ మోటివేషనల్ ట్రైనర్ డాక్టర్ రవీంద్ర అన్నారు. స్థానిక ఏ1 ఫంక్షన్‌హాలులో ఆదివారం ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (అపుస్మా) పదో తరగతి పిల్లలకు మోటివేషనల్ క్లాసులు ఏర్పాటు చేసింది. కార్యక్రమానికి హాజరైన మోటివేషనల్ ట్రైనర్లు డాక్టర్ రవీంద్ర, సింగంశెట్టి అభిషేక్ మాట్లాడుతూ నెలరోజులు మాత్రమే పదో తరగతి పరీక్షలకు సమయం ఉన్నందున ఇతర అంశాల జోలికి వెళ్లకుండా చదువుమీద శ్రద్ధపెట్టాలన్నారు. సెల్‌ఫోన్ వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. మరో మోటివేటర్ రాము మాట్లాడుతూ పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో పిల్లలు చేసే పొరబాట్లను తెలియజేసి వాటిని సరిదిద్దుకోవడం ఎలా అనే అంశాలను సోదాహరణంగా వివరించారు. అపుస్మా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.మాధవరావు, బి.హనుమంతరావు మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో ప్రణాళిక ప్రకారం చదువుతూ ప్రతి ఒక్క విద్యార్థి మంచి మార్కులు తెచ్చుకోవాలన్నారు. సమావేశంలో శ్రీహర్షిణీ విద్యా సంస్థల అధినేత జి.రవికుమార్, శ్రీసరస్వతి విద్యా సంస్థల అధినేత ఏవీ రమణారెడ్డి, శ్రీ ప్రతిభ విద్యా సంస్థల అధినేత నల్లూరి వెంకటేశ్వర్లు, అపుస్మా రాష్ట్ర కార్యదర్శి తులసి విష్ణుప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు, మల్లికార్జున్, వంశీకృష్ణ, మురళీకృష్ణ, సాయి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఆధునిక వైద్యం



యర్రగొండపాలెంలో ఏరియా వైద్యశాల

- నాడు-నేడుతో మారిన ప్రభుత్వాస్పత్రుల రూపురేఖలు
- రూ.60 కోట్లతో సీహెచ్‌సీల అభివృద్ధి
- జిల్లాలోని రెండు ఏరియా వైద్యశాలలు, ఆరు సామాజిక వైద్యశాలలను వంద పడకలుగా మార్పు
- సర్కారు దవాఖానాపై ప్రశంసలు కురిపిస్తున్న ప్రజలు

ప్రభుత్వ వైద్యశాలల రూపురేఖలు మారిపోతున్నాయి. గత ప్రభుత్వంలో శిథిల భవనాలతో అరకొర వైద్యం అందించే స్థితి నుంచి.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాడు-నేడుతో అన్ని హంగులతో రూపుదిద్దుకున్న వైద్యశాలల్లో మెరుగైన వైద్యం పేద ప్రజలకు చేరువైంది. తగినంత మంది వైద్యులు, టెక్నీషియన్లు, అవసరమైన మందులు పుష్కలంగా అందుబాటులో ఉంచారు. జిల్లాలోని క్లస్టర్ హెల్త్ సెంటర్లను వంద పడకల వైద్యశాలలుగా మార్చారు. కోట్ల రూపాయలు వెచ్చించి ప్రజావైద్యాన్ని గాడిలో పెట్టడంతో ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు.

బేస్తవారిపేట

నాడు

ఒకప్పుడు ప్రభుత్వాస్పత్రికి వెళ్లాలంటేనే ప్రజలు భయపడేవారు. సక్రమంగా వసతులు లేక రోగులు ఇబ్బంది పడేవారు. అవసరాలకు తగ్గట్టు పడకలు లేక కటిక నేలమీదే పడుకునేవారు. అరకొర మందులతో అవస్థలు పడేవారు. సకాలంలో వైద్యచికిత్సలు అందక పడిన ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు.

నేడు

నేడు వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక సర్కారు దవాఖానాల స్థితిగతుల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. నాడు-నేడు కింద వైద్యశాలల రూపురేఖలు మారిపోయాయి. ఆధునిక పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. కార్పొరేట్‌కు దీటుగా సకల సౌకర్యాలు సమకూరాయి. ప్రజలకు అత్యుత్తమ వైద్యసేవలు అందుతున్నాయి.

సీహెచ్‌సీ	మంజూరైన నిధులు
గిద్దలూరు	రూ.24 కోట్లు
యర్రగొండపాలెం	రూ.23.25 కోట్లు
దోర్నాల	రూ.3 కోట్లు
కంభం	రూ.3 కోట్లు
దర్శి	రూ.3 కోట్లు
పొదిలి	రూ.1.62 కోట్లు
కొండపి	రూ.1.36 కోట్లు
ఎంసీహెచ్ ఒంగోలు	రూ.1.75 కోట్లు

ఆరోగ్య రక్షణకు పెద్దపీట



రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య రక్షణకు పెద్దపీట వేసింది. రోగులకు సకాలంలో వైద్య సేవలందేలా పకడ్బందీగా అభివృద్ధి చేశారు. మందుల కొరతలేదు. గ్రామీణులకు మెరుగైన సేవలు అందించేందుకు ఫ్యామిలీ డాక్టర్, జగనన్న సురక్ష కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. స్పెషలిస్ట్ డాక్టర్లు అందుబాటులో ఉండటంతో శస్త్రచికిత్సలు జరుగుతున్నాయి.

– డాక్టర్ సూరిబాబు, ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్, గిద్దలూరు.

రూ.60 కోట్లతో అభివృద్ధి పనులు



జిల్లాలోని ఆరు 30 పడకల ఏరియా వైద్యశాలలను 50 పడకలుగా బలోపేతం, రెండు ఏరియా వైద్యశాలలను 100 పడకలతో ప్రాంతీయ వైద్యశాలలుగా పెంచారు. ఎనిమిది వైద్యశాలల్లో అభివృద్ధి పనులకు రూ.60 కోట్లు నాబార్డు నిధులు మంజూరయ్యాయి. అన్నిచోట్ల పనులు పూర్తయ్యాయి.

– విజయభాస్కర్, ఏపీఎంఎస్‌ఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్.



గిద్దలూరు ప్రాంతీయ వైద్యశాల



కంభం సామాజిక వైద్యశాలలో అదనపు గదులు

రూ.60 కోట్లతో అభివృద్ధి...

పేదలకు రోగాలొస్తే ఇక అంతే సంగతులు అనుకునే రోజులు మారాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్నారు. ప్రభుత్వ దవాఖానాలను కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా తీర్చిదిద్దారు. అన్ని వ్యాధులకు ప్రత్యేక వైద్య పరీక్షలు చేసేందుకు అధునాతన పరికరాలు సమకూర్చారు. పేదలకు ఇంటి వద్దకే వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టడంతో ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలోని క్లస్టర్ హెల్త్ సెంటర్లను రూ.60 కోట్లతో అభివృద్ధి చేశారు.

నాడు-నేడు పథకంలో జిల్లాలోని గిద్దలూరు, యర్రగొండపాలెం రెండు సామాజిక వైద్యశాలలను రూ.47.25 కోట్లు ఖర్చుచేసి 100 పడకలతో ప్రాంతీయ వైద్యశాలలుగా మార్చారు. మిగిలిన ఆరు 30, 50 పడకల సామాజిక వైద్యశాలలను 100 పడకల వైద్యశాలలుగా రూ.13.73 కోట్లతో అభివృద్ధి చేశారు. ప్రాంతీయ వైద్యశాలల్లో 25 మంది డాక్టర్లు ఉంటారు. వీరిలో 17 మంది స్పెషలిస్ట్ డాక్టర్లు (సివిల్ అసిస్టెంట్ సర్జన్స్), 32 మంది స్టాఫ్ నర్సులు ఉంటారు. ఏ ప్రాంతంలోనైనా డయేరియా, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలినప్పుడు నిర్వహించే వ్యాధినిర్ధారణ పరీక్షలు చేస్తారు. స్పెషలిస్ట్ డాక్టర్స్ ఉండటంతో గణనీయంగా ఓపీ పెరిగింది. ఆరోగ్యశ్రీలో ఉచితంగా శస్త్రచికిత్సలు చేస్తారు. వంద పడకలకు మార్చడంతో ఇన్‌పేషంట్స్ సామర్థ్యం పెరిగి.. రోగులకు ఎటువంటి అసౌకర్యం లేకుండాపోయింది.

కొండపిలో వైఎస్సార్ సీపీ బలంగా ఉంది

- మాజీ మంత్రి ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసులరెడ్డి
- వైఎస్సార్ విగ్రహావిష్కరణలో పాల్గొన్న రీజినల్ కోఆర్డినేటర్ చెవిరెడ్డి, మంత్రి సురేష్



కార్యక్రమంలో మాట్లాడుతున్న బాలినేని శ్రీనివాసరెడ్డి, పక్కన చెవిరెడ్డి, ఆదిమూలపు సురేష్

సింగరాయకొండ (మర్రిపూడి): కొండపి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ బలంగా ఉందని, ప్రతి నాయకుడు, కార్యకర్త పార్టీ గెలుపునకు కృషి చేయాలని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. సింగరాయకొండ మండల కేంద్రంలోని శానంపూడి జంక్షన్ వద్ద ఆదివారం వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్ కుమార్‌రెడ్డి స్వంత నిధులతో నిర్మించిన వైఎస్సార్ ముఖద్వారం, వైఎస్సార్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బాలినేని మాట్లాడుతూ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీకి ఢోకా లేదని, జనంలో పార్టీ బలంగా ఉందన్నారు. కానీ గత రెండు ఎన్నికల్లో పార్టీలోని గ్రూపుల కారణంగా ఓటమి పాలైందని, ఈసారి అలా జరగకుండా ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా ఉండి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌ను అఖండ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్ విగ్రహాన్ని ప్రారంభించడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆ మహానుభావుడు ప్రతి పేదవాని గుండెల్లో కొలువై ఉన్నాడన్నారు. ఏ వ్యక్తి అయినా పనిమీద రాజశేఖరరెడ్డిని కలవటానికి వెళ్లినప్పుడు ఆ పని అయినా, కాకపోయినా సంతోషంగా బయటకు వస్తారని అటువంటి గొప్ప వ్యక్తి అని గత స్మృతులను నెమరేసుకున్నారు. వైఎస్సార్ ప్రజల గుండెల్లో ఉన్నాడు కాబట్టే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు దీటుగా వైఎస్సార్ విగ్రహాలను వాడవాడలా ఏర్పాటు చేశారని, ఇది ఆయన గొప్పతనానికి, మంచితనానికి నిదర్శనమన్నారు. గ్రామాల్లోనే కాకుండా దళిత వాడల్లో కూడా వైఎస్సార్ విగ్రహాలను ఏర్పాటు చేసుకున్నారన్నారు. కొండపి వైఎస్సార్ సీపీ లో గ్రూపులు ఉన్నప్పటికీ అందరూ నాదగ్గరకు వస్తారని అందరికీ పని చేసేవాడని నేను గ్రూపులను ఏనాడు పట్టించుకోలేదన్నారు. పార్టీలో ఉంటూ పార్టీకి ద్రోహం చేయవద్దని హితవు పలికారు. పార్టీ రీజినల్ కోఆర్డినేటర్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి మాట్లాడుతూ కొండపితో పాటు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పార్టీ జెండా ఎగిరేలా ప్రతి ఒక్కరూ కృషి చేసి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



మాట్లాడుతున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ వైఎస్సార్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. సేవా కార్యక్రమాలు చేయడంలో డాక్టర్ అశోక్‌కుమార్‌రెడ్డి ముందు ఉంటారన్నారు. కొండపి నియోజకవర్గంలో ఎన్ని గ్రూపులున్నా వారందరూ జగనన్న కుటుంబమేనని వివరించారు. రాబోయే ఎన్నికల్లో కొండపిలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయటానికి సిద్ధంగా ఉన్నానని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సేవలను, ఆయన గొప్పతనాన్ని, అమలు పథకాలను ఆయన కొనియాడారు.

రాష్ట్ర ప్రభుత్వ సామాజిక న్యాయసలహాదారు జూపూడి ప్రభాకరరావు మాట్లాడుతూ వైఎస్సార్ ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడిగా ఉన్నాడని, ఆయన కుమారుడు జగన్‌మోహన్‌రెడ్డి తండ్రికి తగ్గ తనయుడిగా సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రతి పేదవాని గుండెల్లో నిలిచాడన్నారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ఇద్దరూ నిలకడలేనివారని, వీరు కలిసి వచ్చినా ఒరిగేది ఏమీ లేదని విమర్శించారు. పార్టీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ ముఖద్వారం, విగ్రహాల ఏర్పాటుకు సంవత్సర కాలం పట్టిందని తాను ఏవిధంగా వీటిని ఏర్పాటు చేసింది, మండలంలో వైఎస్సార్ సీపీ హయాంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. అంతకుముందు ఉత్తర బైపాస్ రోడ్ నుంచి సభావేదిక వరకు మంత్రి సురేష్ తనయుడు విశాల్ స్వయంగా బైక్ నడిపి భారీ బైక్ ర్యాలీకి నేతృత్వం వహించారు. తరువాత వైఎస్సార్ ముఖద్వారాన్ని, నిలబడిన, యోగముద్రలో ఉన్న రెండు వైఎస్సార్ విగ్రహాలను ఆవిష్కరించారు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఏపీఐఐసీ చైర్మన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, ఎంపీపీ కట్టా శోభారాణి, వైస్ ఎంపీపీ, పార్టీ మండల అధ్యక్షుడు సామంతుల రవికుమార్‌రెడ్డి, షేక్ షకీల, సర్పంచ్ తాటిపర్తి వనజ, శ్రీ వరాహలక్ష్మీ నరశింహస్వామి దేవస్థాన చైర్మన్ పామర్తి మాధవరావు, రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ యనమల మాధవి, శ్రీశైలం దేవస్థాన బోర్డు మెంబర్ తన్నీరు ధర్మరాజు, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి యన్నాబత్తిన చిన్నా, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి శీలం రాము, రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి చుక్కా కిరణ్‌కుమార్, రాష్ట్ర మహిళా విభాగం సంయుక్త కార్యదర్శి రాపూరి ప్రభావతి, కనుమళ్ల సొసైటీ చైర్మన్ మలినేని వెంకటేశ్వర్లు, చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వైఎస్సార్ విగ్రహం శిలాఫలకాన్ని ఆవిష్కరించిన దృశ్యం



యోగముద్రలో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



భారీ బైక్ ర్యాలీలో పాల్గొన్న మంత్రి సురేష్ కుమారుడు విశాల్

రోశయ్యతో అనుబంధం మరువలేను

- కొణిజేటి రోశయ్య విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు గవర్నర్‌గా పనిచేసిన కొణిజేటి రోశయ్యతో తనకు ఉన్న అనుబంధం మరువలేనిదని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక శ్రీబాపూజీ మార్కెట్ కంప్లెక్స్‌కు ఎదురుగా సొంత ఖర్చులతో నిర్మించిన రోశయ్య కాంస్య విగ్రహాన్ని ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బాలినేని ఆవిష్కరించారు. రిమోట్ సాయంతో విగ్రహాన్ని ఆవిష్కరించి నమస్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తన తండ్రి, రోశయ్య ఇద్దరు హిందూ కాలేజీలో చదువుకున్నారని చెప్పారు. లైలా తుఫాన్ సమయంలో ఒంగోలు వచ్చిన రోశయ్య.. ఆర్థిక సాయం అందుతుందా అని ప్రజలను అడిగితే.. అందుతోందంటూ చప్పట్లు వినిపించడంతో ఆయన ఆశ్చర్యపోయారన్నారు. ఎప్పుడూ సాయం అందలేదంటూ జనం చెప్పేవారని, కానీ ఒంగోలులో అందుకు భిన్నంగా స్పందన రావడంతో తనను వెన్నుతట్టి అభినందించారని అన్నారు. ఆయనతో ఉన్న అనుబంధం వల్లే తాను ఒంగోలులో మంచి సెంటర్‌లో రోశయ్య కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని మాట ఇచ్చానని, అందుకు తగ్గట్లుగానే నేడు విగ్రహాన్ని ఏర్పాటు చేయగలగడం తన అదృష్టంగా పేర్కొన్నారు. ఆర్యవైశ్య సోదరులు కోరుతున్నట్లుగా రోశయ్య సెంటర్‌గా ఈ ప్రాంతానికి నామకరణం చేసే విషయంలో నగరపాలక సంస్థ అధికారులు, పాలకవర్గంతో మాట్లాడి తదుపరి నిర్ణయం తీసుకుంటామని భరోసా ఇచ్చారు. రోశయ్య ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామన్నారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ 16 సార్లు అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టిన ఏకైక ఘనత రోశయ్యకు మాత్రమే దక్కిందని, దేశ చరిత్రలోనే ఆయనది ఒక రికార్డు అన్నారు. చక్కటి విగ్రహాన్ని ఏర్పాటు చేయించిన బాలినేనికి ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు శిద్దా రాఘవరావు మాట్లాడుతూ మరో వైపు స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి రోశయ్య విగ్రహాన్ని నిర్మించి ఆర్యవైశ్యులకు నిత్య స్ఫూర్తిని కల్పించడంతోపాటు దశాబ్దాల తరబడి ఆరామ క్షేత్ర నిర్మాణానికి స్థలాన్ని ఉచితంగా కేటాయించడం అభినందనీయం అని, రాబోయే ఎన్నికల్లో ఆర్యవైశ్యులు కృతజ్ఞతగా బాలినేని విజయానికి కృషిచేయాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులకు అక్కడ జగనన్న, ఇక్కడ వాసన్న అండగా నిలుస్తున్నారన్నారు. వారు అందిస్తున్న చేయూతను చెప్పుకునేందుకు రోజులు చాలవంటూ రాబోయే ఎన్నికల్లో వాసన్నను గెలిపించుకుని విశ్వాసాన్ని పెంపొందించుకుందామన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త చలువాది బదరీనారాయణ వేదికపైనే రోశయ్య విగ్రహానికి స్టీల్ ఫెన్సింగ్ వంటిది వేయిస్తానని ప్రకటించారు. సభకు అధ్యక్షత వహించిన తాత బదరీనాథ్ మాట్లాడుతూ రోశయ్య జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమ నిర్వాహకులు, ఆర్యవైశ్య సంఘ జిల్లా అధ్యక్షుడు ఆర్‌కే జనార్ధన్, నగర మేయర్ గంగాడ సుజాత, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు పోతుల సురేష్, శ్రీబాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ చైర్మన్ కోడూరి సత్యన్నారాయణ, ఆర్యవైశ్య నాయకులు గ్రంధి చెంచురామారావు, దేవతు శ్రీరాములు, కూరపాటి సత్యన్నారాయణ, జలదంకి వెంకట కృష్ణారావు, మోదుకూరి శ్రీనివాసులు, కారంశెట్టి కిరణ్‌కుమార్, గుర్రం బదరీనాథ్, దేవకి వెంకటేశ్వర్లు, కొత్తూరి శ్రీరంగనాయకులు, తాత ప్రసాద్, బీఎంఆర్ శంకర్ తదితర ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, వేదికపై మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, కుప్పం ప్రసాద్ తదితరులు



కొణిజేటి రోశయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న బాలినేని, మాగుంట, శిద్దా, గంగాడ సుజాత, కుప్పం ప్రసాద్

ముందు నీ కుర్చీ సంగతి చూసుకో బాబూ

- కుర్చీ మడత పెట్టడం కాదు..
- చంద్రబాబుపై ధ్వజమెత్తిన జూపూడి

సింగరాయకొండ (మర్రిపూడి): ''కుర్చీ మడత పెట్టడం కాదు ముందు నీ కుర్చీ సంగతి చూసుకో బాబు'' అని చంద్రబాబు నాయుడిని రాష్ట్ర సామాజిక న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకరరావు విమర్శించారు. సింగరాయకొండలో వైఎస్సార్ ముఖద్వారం ప్రారంభోత్సవానికి వచ్చిన సందర్భంగా విలేకరుల సమావేశంలో జూపూడి తనదైన శైలిలో చంద్రబాబుపై విమర్శలు చేశారు. జూపూడి మాట్లాడుతూ జగన్ దెబ్బకు చంద్రబాబు భార్య, కొడుకు, సినిమాలు తీసుకునే బావమరిది ఆయనతో పాటు పవన్ కళ్యాణ్ బయటకు వచ్చారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు రెండు కళ్లకు ఆపరేషన్ జరిగి అతను సరిగా చూడలేకపోతున్నారని దీంతో జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి అతనికి కనబడటం లేదని విమర్శించారు. చంద్రబాబు సభలకు జనం రావటం లేదని, చివరికి కుర్చీలు తీసేవారు లేక వారే కుర్చీలు మడత పెట్టుకోవాల్సిన దుస్థితి ఉందన్నారు. చంద్రబాబు మోదీ చుట్టూ తిరిగినప్పుడే అతని పని అయిపోయిందని విమర్శించారు. చంద్రబాబు సంగతి మోదీకి, అమిత్‌షాకు తెలియదా అని అన్నారు. కొండపి ఎమ్మెల్యే స్వామి గడ్డిపూచకన్నా హీనమైన వ్యక్తి అని విమర్శించారు. స్వామికి మంత్రి సురేష్‌ను, జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే స్థాయి లేదన్నారు. కొండపి నియోజకవర్గంలో 122 గ్రామాలు ఉన్నాయని, ఏనాడైన మాల పల్లెకు గాని, మాదిగ పల్లెకు గాని వెళ్లాడా అని ప్రశ్నించారు. స్వామి గతంలో దామచర్ల ఆంజనేయులు కాళ్లకు కట్లు కట్టేవాడని, ఇప్పుడేమో ఆయన మనవడు సత్యాకు ఏమి చేస్తున్నాడో అని ఎద్దేవా చేశారు. ఏనాడైనా కారులో డ్రైవర్ పక్క సీటులో కూర్చునేవాడా అని విమర్శించారు. డ్రైవర్ పక్కన సత్యా కూర్చుంటే ఇతను వెనకాల గన్‌మెన్‌లు పెట్టుకుని కూర్చునేవాడని హేళన చేశాడు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జూపూడి ప్రభాకరరావు, పక్కన మంత్రి సురేష్

మంత్రి సురేష్‌ను ఎదుర్కొనే ధైర్యం లేక అప్పుల కోసం ఊరూరా తిరుగుతున్నాడని, ఇతనికి భరోసా ఇచ్చే సత్యా ఏమో ఉత్తరాదిన శ్రీకాకుళం జిల్లాలో తిరుగుతున్నాడన్నారు. అంబేడ్కర్ వాదిగా నా దృష్టిలో స్వామి గడ్డిపూచకన్నా హీనమైన వాడని, ఏనాడూ దళితవాడలను అభివృద్ధి చేయలేదని విమర్శించారు. సత్యా వెంట లేకుండా గ్రామాలకు ఒక్కడే వెళ్లలేని వ్యక్తి స్వామి అని అవహేళన చేశారు. విదేశీ విద్యకు అంబేడ్కర్ పేరు మార్చారని స్వామి విమర్శిస్తాడని చంద్రబాబు విదేశీ విద్యకు రూ.15 లక్షలు ఇస్తే, జగన్‌మోహన్‌రెడ్డి రూ.1.25 కోట్లు ఇచ్చాడన్నారు. సురేష్‌ను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయగల సత్తా ఉందన్నారు.

రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ విజేత ప్రకాశం

వేటపాలెం: రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీల్లో ఫైనల్ విజేతగా ప్రకాశం జిల్లా జట్టు నిలిచింది. బాపట్ల జిల్లా వేటపాలెం మండలం పందిళ్లపల్లి జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో రెండు జరుగుతున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీల్లో ప్రకాశం, కృష్ణా, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లా జట్లు పాల్గొన్నాయి. లీగ్ మ్యాచ్‌లో గెలుపొంది ఫైనల్ పోటీల్లో ప్రకాశం జట్టుపై శ్రీకాకుళం జట్టు తలపడింది. నిర్ణీత సమయంలో శ్రీకాకుళం 18 పాయింట్లు సాధించగా, ప్రకాశం జట్టు 25 పాయింట్లతో విజేతగా నిలిచింది. రెండో స్థానంలో శ్రీకాకుళం జట్టు, మూడో స్థానంలో కృష్ణా, నాల్గవ స్థానంలో విశాఖపట్నం జట్టు నిలిచాయి. అనంతరం పూర్వ విద్యార్థులు విజేతలకు బహుమతులు అందజేశారు. మాజీ క్రీడల సంక్షేమ అధికారి అంతర్జాతీయ క్రీడాకారులు నక్కల అర్జున్‌రావుని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.



ఫైనల్ విజేత ప్రకాశం జట్టు

క్లుప్తంగా

మిద్దె పైనుంచి జారిపడి వ్యక్తి మృతి



మృతుడి భౌతికకాయాన్ని పరిశీలిస్తున్న ఎస్సై నరసింహారావు

బేస్తవారిపేట: మండలంలోని మోక్షగుండం లో మిద్దెపై నుంచి జారిపడి ఒకరు మృతి చెందారు. ఈ సంఘటన ఆదివారం జరిగింది. మృతుడు గిద్దలూరు ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్నాడు. కర్రావుల రామకృష్ణారెడ్డి(61) ఇంటిపై అదనంగా గృహం కట్టుకుంటున్నాడు. ఆదివారం క్యూరింగ్ చేస్తున్న సమయంలో మెట్లపై నీరు ఉండటంతో ప్రమాదవశాత్తు జారి కింద కాంపౌండ్ గోడపై పడ్డాడు. పై నుంచి గోడపై పడటంతో తల పగిలి తీవ్రంగా గాయపడ్డాడు. రామకృష్ణారెడ్డి కొద్దిసేపటికే మృత్యువాతపడ్డాడు. మృతుడికి భార్య రమణమ్మ, కూతురు, కుమారుడు ఉన్నారు. ఎస్సై నరసింహారావు కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మెగా క్రికెట్ టోర్నీ ప్రారంభం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న బాలినేని, ఆదిమూలపు, చెవిరెడ్డి



బ్యాటింగ్ చేస్తున్న చెవిరెడ్డి భాస్కరరెడ్డి



బ్యాటింగ్ చేస్తున్న బాలినేని

ఒంగోలు: మెగా అభిమానులు స్థానిక శర్మా కాలేజీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన మెగా సౌత్ జోన్ క్రికెట్ టోర్నీని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కరరెడ్డిలతో కలిసి కొద్దిసేపు క్రికెట్ ఆడి క్రీడాకారులను అలరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రికెట్ పోటీలను చిరంజీవి అభిమానులు వరుసగా మూడో ఏడాది కూడా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇటీవలే ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పోటీలను గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిర్వహించి ఎంతో మంది క్రీడాకారులను వెలికితీశారన్నారు. మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, రీజినల్ కో ఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కరరెడ్డి మాట్లాడుతూ కర్నాటక, తమిళనాడు, తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్ నుంచి 16 జట్లు పాల్గొనడం క్రికెట్ అభిమానులకు పండుగ అన్నారు. క్రీడాభిమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు అయినాబత్తిన ఘనశ్యాం మాట్లాడుతూ పోటీల్లో గెలుపొందిన విజేతలకు రూ.4 లక్షల బహుమతిని బాలినేని అందిస్తున్నందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. రెండో బహుమతిగా రూ.2లక్షలు, మూడో బహుమతిగా రూ.లక్ష, నాల్గవ బహుమతిగా రూ.50వేలు అందిస్తామని నిర్వాహకులు దుంబు పేర్కొన్నారు. సాయంత్రం జరిగిన రెండో మ్యాచ్‌ను ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి లాంఛనంగా ప్రారంభించి కొద్దిసేపు క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్తేజపరిచారు.

మెరుగైన వైద్యమే ప్రభుత్వ లక్ష్యం



భవన ప్రారంభోత్సవంలో వైద్య విధాన పరిషత్ కమిషనర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

గిద్దలూరు రూరల్: ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ ఎస్.వెంకటేశ్వర్ అన్నారు. పట్టణంలోని ఏరియా వైద్యశాలలో నాడు–నేడు కింద రూ.24 కోట్లతో నిర్మించిన 100 పడకల ప్రాంతీయ వైద్యశాల నూతన భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గిద్దలూరు ఏరియా వైద్యశాలను ట్రైబల్ వైద్యశాలగా మార్చడం వల్ల ఈ ప్రాంత ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. చిన్నతనంలో తన తండ్రికి పక్షవాతం వస్తే గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తీసుకువచ్చామని, అప్పుడు ఇక్కడ సిబ్బంది మెరుగైన వైద్యం నిమిత్తం కర్నూలు వైద్యశాలకు పంపారన్నారు. అటువంటి పరిస్థితులు ఇప్పుడు ఈ ప్రభుత్వంలో లేవన్నారు. గుండెలో రక్తనాళాలు కరిగించే సామర్థ్యం కలిగిన వైద్యశాలను ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయడం చాలా గొప్ప విషయమన్నారు. అన్ని వసతులతో కూడిన వైద్యశాల ఈ ప్రాంతంలో ఉండటం వల్ల ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు. గిద్దలూరు సమన్వయకర్త, మార్కాపురం ఎమ్మెల్యే కుందూరు నాగార్జునరెడ్డి మాట్లాడుతూ విద్య, వైద్యం జగనన్నకు రెండు కళ్లు అని గుర్తుచేశారు. రాష్ట్రంలో 11 మెడికల్ కాలేజీలు ఉండగా నేడు మరో అదనంగా 16 మెడికల్ కాలేజీలు ప్రారంభించారన్నారు. అందులో పశ్చిమప్రాంతం మార్కాపురంలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయడం వల్ల ఈ ప్రాంతప్రజలకు మరింత వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. జగనన్న ప్రభుత్వంలో 55 వేల మందికి వైద్యరంగంలో ఉద్యోగ అవకాశాలు దక్కాయన్నారు. 70 ఏళ్ల చరిత్రలో ఇటువంటి నాయకుడిని మనం ఎక్కడా చూసిన దాఖలాలు లేవన్నారు. 106 మంది సిబ్బంది, 8 ఆపరేషన్ థియేటర్లు, 18 మంది డాక్టర్లు కలిగిన 100 పడకల వైద్యశాలను ప్రారంభించడం స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబు కృషి ఉందన్నారు. ఈ వైద్యశాలను ట్రైబల్ వైద్యశాలగా మార్చేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లి ట్రైబల్ వైద్యశాలగా మార్చారన్నారు. పేదలు దూరప్రాంతాలకు వైద్యం కోసం వెళ్లకుండా అన్ని వసతులతో కూడిన వైద్యశాలను అందుబాటులోకి తీసుకువచ్చిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ మూర్తి, నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, కమిషనర్ వి.శ్రీనివాసరావు, ఎంపీపీ కడప లక్ష్మి, వైద్యశాల సూపరింటెండెంట్ సూరిబాబు, వైద్యశాల కమిటీ సభ్యులు డాక్టర్ రంగారెడ్డి, డాక్టర్ జేవీ నారాయయ, బందారు నిర్మలాదేవి, వైస్ ఎంపీపీ నోవెల్, వైఎస్సార్ సీపీ నాయకులు మాజీ ఎంపీపీ కడప వంశీధరరెడ్డి, ఓబులరావు, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తాపడి డ్రైవర్ మృతి



సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరిస్తున్న సీఐ

- ఐదుగురికి గాయాలు



ఆటో డ్రైవర్ ముసలయ్య మృతదేహం

ముండ్లమూరు: మండలంలోని తాళ్లూరు రోడ్డులో శ్రీరాం డెయిరీ సమీపంలో ఆటో అదుపు తప్పి బోల్తా పడడంతో డ్రైవర్ మార్పిడి ముసలయ్య (59) అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఐదుగురికి గాయాలయ్యాయి. బాధితులు, పోలీసుల కథనం మేరకు..చీమకుర్తి మండలం పల్లామల్లి గ్రామం, సంతనూతలపాడు గ్రామాలకు చెందిన బంధువులు కలిసి ముండ్లమూరు మండలంలోని బొప్పూడివారిపాలెం పోలేరమ్మ గుడికి ఆదివారం ఆటోలో వచ్చారు. గుడి వద్ద పొంగళ్లు పొంగించి మొక్కులు తీర్చుకున్న అనంతరం ఆటోలో స్వగ్రామాలకు బయలుదేరారు. మార్గమధ్యంలో ముండ్లమూరు– తాళ్లూరు రోడ్డులో శ్రీరాం డెయిరీ సమీపంలో సుడి గాలి రావడంతో కళ్లలో దుమ్ము పడడంతో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో ఆటో డ్రైవర్ ముసలయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న పల్లామల్లికి చెందిన తేజస్వని, రమాదేవిలకు సంతనూతలపాడుకు చెందిన ఇస్తర్ల వెంకటలక్ష్మీ, బంగారమ్మ, డి ఏసమ్మలకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108 వాహనంలో ముండ్లమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేసి పంపారు. సమాచారం తెలుసుకున్న దర్శి సీఐ షమీముల్లా, ఎస్సై యువీ కృష్ణయ్యలు సంఘటనా స్థలానికి చేరుకొని సంఘటనా స్థలం వద్ద బాధితులతో మాట్లాడి ప్రమాదానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ కానిస్టేబుళ్ల ప్రేమానిధి, సూరిబాబులో సకాలంలో బోల్తా పడిన ఆటో వద్దకు చేరుకొని గాయపడిన వారిని రెండు 108 వాహనాల్లో ఎక్కించి వైద్యశాలకు తరలించేందుకు సహకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కలిసికట్టుగా ముందుకు సాగుదాం

- జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం
- పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్



మాట్లాడుతున్న దద్దాల నారాయణ యాదవ్, వేదికపై పీడీసీసీబీ చైర్మన్ ప్రసాద్‌రెడ్డి, చైర్మన్ గఫార్ తదితరులు

కనిగిరి రూరల్: మనమంతా సమష్టిగా పనిచేద్దాం..జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందాం అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం రాత్రి మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ జగనన్న ఆశీస్సులతో.. వాసన్న దీవెనలతో తనను కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించినట్లు చెప్పారు. తనకు ఉన్నత స్థాయిని కల్పించిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి, బాలినేని శ్రీనివాసులరెడ్డికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటానన్నారు. నవరత్నాల పథకాలతో ప్రతి ఇంట్లో రూ.లక్ష నుంచి రూ.20 లక్షల వరకు లబ్ధి చేకూరిందన్నారు. సంక్షేమ లబ్ధిదారులకు జరిగిన లబ్ధిని వివరించి, ఫ్యానుగుర్తుకు ఓటు వేసేలా చైతన్య వంతులు చేయాలన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో కార్యకర్తలంతా సైనికుల్లా పనిచేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం చేసుకుకోవాలని వివరించాలన్నారు. ఈనెల 21న స్థానిక పవిత్రా కల్యాణ మండపంలో జరిగే పరిచయ కార్యక్రమానికి మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు, రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతల చెరువు సత్యన్నారాయణరెడ్డిలతో పాటు పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు హాజరవుతారని చెప్పారు. నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ వివిధ విభాగాల అధ్యక్ష, కార్యదర్శులు, కార్పొరేషన్ చైర్మన్లు, డైరక్టర్, సొసైటీ చైర్మన్లు అందరూ తప్పక హాజరుకావాలని పిలుపునిచ్చారు.

విద్యావంతుడైన దద్దాల నారాయణను గెలిపించుకుందాం

యువకుడు, విద్యావంతుడైన డాక్టర్ దద్దాల నారాయణను ఎమ్మెల్యేగా గెలిపించుకుని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకుందామని పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలతో ప్రతి ఇంట్లో సంక్షేమ కాంతులు విరజిల్లుతున్నట్లు చెప్పారు. అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లుగా సీఎం వైఎస్ జగన్ పరిపాలన సాగిస్తున్నట్లు చెప్పారు. జెడ్పీటీసీల సంఘ జిల్లా అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, ఎంపీపీ డి.ప్రకాశం, మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, వాసవీ సత్ర సముదాయాల జాతీయ అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పార్టీ శ్రేణులంతా ప్రణాళికాబద్ధంగా, గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ అత్యాల జఫన్య, మాజీ జెడ్పీటీసీ రామన తిరుపతిరెడ్డి, జెడ్పీటీసీ ఒకేరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్ మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మాణిక్యరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు తమ్మినేని సుజాతరెడ్డి, వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి, మూలే గోపాల్‌రెడ్డి, శ్రీహరిరెడ్డి, సిద్ధారెడ్డి, కటికల వెంకట రత్నం, ఎస్‌కే ఖాజా, జి.అబ్రహం లింకన్, చింతం శ్రీను, దాదిరెడ్డి మాల కొండారెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు యక్కంటి శ్రీను, జి.బొర్రారెడ్డి, పిల్లి లక్ష్మీ నారాయణరెడ్డి, మార్తాల వెంకటేశ్వరరెడ్డి, మహేంద్రారెడ్డి పాల్గొన్నారు.

సరైన పత్రాలు చూపాలి

టంగుటూరు: నగదు తరలించే క్రమంలో సరైన పత్రాలు చూపాలని ఒంగోలు డీఎస్పీ కిషోర్‌బాబు అన్నారు. స్థానిక టోల్‌ప్లాజా వద్ద వాహన తనిఖీలను డీఎస్పీ కిషోర్‌బాబు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎవరైనా పెద్ద మొత్తంలో నగదు తీసుకువెళుతుంటే తప్పనిసరిగా సరైన పత్రాలు వెంట తెచ్చుకోవాలని సూచించారు. ఇతర రాష్ట్రాల నుంచి మద్యం అక్రమ రవాణాకు పాల్పడితే వారిపై చట్టపర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం టోల్‌ప్లాజా వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి సూచనలు, సలహాలు చేశారు. ఎస్సై నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



టోల్‌ప్లాజా వద్ద వాహన తనిఖీలు చేస్తున్న డీఎస్పీ కిషోర్‌బాబు

వైఎస్ పాలనలోనే ముస్లింలకు పెద్దపీట

- మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి



డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డిని సత్కరిస్తున్న సైదా, జుబేర్ అహ్మద్, నాయకులు

కురిచేడు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లింలకు రిజర్వేషన్ కల్పించి సముచిత స్థానం కల్పించారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ దర్శి ఇన్‌చార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. స్థానిక మదరస ఏ దారుల్ ఉలూమ్ హుస్సేనియా, ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ వార్షికోత్సవ జల్సా కార్యక్రమంలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఢిల్లీ నుంచి కార్యక్రమానికి హాజరైన ముస్లిం పెద్దలు హుస్సేన్ అహ్మద్ సాహెబ్, మునీరుద్దీన్ సాహెబ్‌ల ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర రెడ్డి ముస్లింలకు సముచిత స్థానం కల్పిస్తే ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి షేక్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి రాజకీయంగా సముచిత స్థానం కల్పించి ఆదరించారన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ముస్లింలను వాడుకొని వదిలేస్తే వైఎస్ పాలనలో ముస్లింలకు సముచిత స్థానంతో పాటు అన్ని విధాలా వారి అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్ మోహనరెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దర్శి నియోజకవర్గంలో గత 20 ఏళ్లుగా అన్ని విధాలా ప్రజలకు అండగా ఉంటూ సేవ చేస్తున్న బూచేపల్లి కుటుంబాన్ని ఆదరించాలన్నారు. దర్శి నియోజకవర్గం తరఫున జగనన్న సైనికుడిగా పోటీ చేస్తున్న తనను ఆశీర్వదించి ఆదరించాలని, అధిక మెజార్టీతో విజయం చేకూర్చాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనర్ షేక్. సైదా, హజరత్ మౌలానాముఫ్తి జుబేర్ అహ్మద్‌సాహెబ్, రాష్ట్ర నెడ్‌క్యాప్ డైరెక్టర్ సానికొమ్ము తిరుపతిరెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్, వైద్యవిభాగం కన్వీనర్ డాక్టర్ ఎస్ ఎం బాషా, జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, కె.రమణారెడ్డి , జిల్లా ఎస్సీ సెల్ కన్వీనర్ గాలిమూటు దేవప్రసాదు, ఏఎంసీ వైస్ చైర్మన్ కండె గంగయ్య, మాజీ వైస్ చైర్మన్ కె.నాగేశ్వరరావు, చైర్మన్ షకీల అమీన్‌బాష, పార్టీ మండల కన్వీనర్ వైవీ సుబ్బయ్య, నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి జాతీయ ఇన్నోవేటివ్ అవార్డు



అవార్డు అందుకున్న ఉపాధ్యాయురాలు స్వాతి

కురిచేడు: మండలంలోని బోదనంపాడు ఎస్సీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు వల్లెంస్వాతికి జాతీయ ఇన్నోవేటివ్ ఎడ్యుకేషన్ రత్న 2023 అవార్డు లభించింది. చత్తీస్‌ఘడ్‌కు చెందిన నవాచారి విద్యా ఇన్నోవేటివ్ టీచర్స్ సమూహ సంస్థ అవార్డు అందజేసింది. విద్యార్థుల్లో శాస్త్ర సాంకేతిక నైపుణ్యాలు, గుణాత్మక విద్య, నైతిక విలువలు పెంపొందించడంతో పలు విద్య, సామాజిక సేవల్లో పాల్గొన్నందుకు అవార్డు అందజేసినట్లు తెలిపారు. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి మొత్తం 700 మంది దరఖాస్తు చేసుకోగా 111 మంది ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. అందులో స్వాతికి అవార్డు లభించింది.

సీఐటీయూ శిక్షణ తరగతులు ప్రారంభం



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న సీనియర్ నాయకులు

ఒంగోలు టౌన్: జిల్లా సీఐటీయూ ముఖ్య కార్యకర్తల రాజకీయ శిక్షణ తరగతులు ఆదివారం ప్రారంభమయ్యాయి. హిందుత్వ శక్తులు ప్రతిఘటన పద్ధతులు అనే అంశంపై శిక్షణ ఇచ్చారు. కార్మికులపై ఆర్థిక సంస్కరణల ప్రభావం, కార్మికుల కర్తవ్యం అనే అంశంపై సాయంత్రం క్లాసులు నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి గంటినపల్లి శ్రీనివాసులు ప్రిన్సిపాల్‌గా వ్యవహరించగా సీఐటీయూ జిల్లా మాజీ కార్యదర్శి వై. సిద్ధయ్య, సీఐటీయూ మాజీ ఉపాధ్యక్షుడు పూనాటి ఆంజనేయులు తరగతులను బోధించారు. పి. రూబెన్ విప్లవ గీతాలు ఆలపించారు. జిల్లా నలుమూలల నుంచి సీఐటీయూ నాయకులు హాజరయ్యారు. కాలం సుబ్బారావు, పి.కల్పన, టి. మహేష్, జివి కొండారెడ్డి నిర్వాహకులుగా వ్యవహరించారు.